ఖండ ఖండాంతర ఖ్యాతి నార్జించిన
మహనీయులను గన్న మాతృభూమి
పాశ్చాత్య వీరుల పారద్రోలించియు
స్వాతంత్ర్యమును గన్న సమర భూమి
పాండిత్యమున చాల ప్రఖ్యాతి గాంచియు
ప్రతిభ చూపించిన భరత భూమి
సంగీత సాహిత్య శాస్త్రీయ విద్యల
ధీ శక్తి చూపిన దివ్యభూమి
చిత్ర కళల తోడ చిత్రమై యున్నట్టి
భరత భూమియందు జననమంది
భరత మాత ధర్మ భాగ్యంబు కాపాడ
బాధ్యతంతయు మీదె పౌరులారా!

దివ్యాత్మ స్వరూపులారా!

ప్రాచీన కాలమునుండి భారత దేశము ఆధ్యాత్మిక తత్వప్రభావముల చేత అన్ని దేశములకు సుస్థిర శాంతి భద్రతలను చేకూర్చుచూ వచ్చుచున్నది. కనుకనే నాటికి నేటికి 'లోకా స్సమస్తా సుఖినో భవంతు' అన్నదే భారతీయుల యొక్క ధ్యేయము. సృష్టి అనగా ఈశ్వర ప్రకటనయే. దాని పేరే ప్రకృతి. ఈ ప్రకృతి యందు ఆవిర్భవించిన ప్రతి ప్రాణికి కూడను ప్రకృతి యొక్క స్వభావముచే సహజముగా వుండాలి. ఈశ్వర ప్రకటనగా వించే నిమిత్తమై మూర్తీభవించినవాడే మానవుడు. ఇట్టి దివ్యమైన భవ్యమైన మానవత్వాన్ని మనము ధరించి దివ్యత్వమును విస్మరించి కేవలము అనిత్యము అశాశ్వతము అయినటువంటి భౌతికమునకే మనం పాటుపడుటంచేత అనేక అశాంతులకు గురికావలసి వచ్చింది. ప్రపంచములో ప్రతి జీవికి జీవిత పరమావధి అంటే యేమిటో బోధపడదు. బోధపడాలెదనే భావము చాలామందికి వుండదు. నూటికో కోటికో ఏ ఒక్కరికో యీ భావము ఏర్పడుతుంది. అదియే పరమార్థమునకు ప్రథమ సోపానము. కడుపునిండుకు తిండి, కంటి నిండుకు నిద్ర, ఒంటి నిండుకు బట్ట, యింటి నిండుకు పిల్లలు యివే యింతకంటె మించిన పరార్థము వేరొకటి వున్నదా యని అనేకమంది భావిస్తారు. ఇది నిజమే. ఇది అవసరమే. కాని యింతటితో

మానవత్వము పరిపూర్ణత నొందలేదు. మానవత్వము పరిపూర్ణత నొందవలెనన్న దివ్యమైన మానవత్వమును మనం
అభివృద్ధి పరచుకోవాలి. మానవతా గుణములను అభివృద్ధి పరచుకోవాలి. మానవతా గుణములను పోషిం
చుకోవాలి. అప్పుడే యీ మానవత్వము యొక్క పవిత్రతను దివ్యముగా మనము అనుభవించిన వారమౌతాము

(1) కర్మకు ఆధారము జ్ఞానము. జ్ఞానమునకు ఆధారము కర్మ. ఈ కర్మ జ్ఞానముల యొక్క
సమన్వయమును మనము అర్థము చేసుకున్నప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. లోకములో అన్న
ము భోగము, ఆనందము యోగము. అన్నముతో ప్రారంభమైన మానవత్వము ఆనందము వరకు సాగి
పోవాలి. అప్పుడే మానవత్వము సార్థకమవుతుంది. అన్నముతో ప్రారంభమై అన్నముతోనే అంత్యమగుట
యిది మనకు సరియైనది కాదు. మానవత్వమునే అవమాన పరచినట్లవుతుంది. పశుపక్షి మృగాదులు కూడ
ను అన్న ఆహారముల చేత జీవితమును గడుపుతూనే వున్నవి. కానీ మానవత్వము 'జంతూనాం నరజన్మ
దుర్లభం' భారతదేశమునందు యిటువంటి పవిత్రమైన సంస్కృతి అనాది కాలమునుండి వస్తున్నది.

భవ్య భావాలు కలిగిన భారతీయ
దివ్య మానస తత్త్వంబు తెలిసికొనగ
భారతీయులు యత్నింప నేర్వరైరి
యింతకన్నను దౌర్భాగ్యమేమి కలదు

పవిత్రమైన భారతదేశమందు ఆవిర్భవించి మానవుడనే నామాన్ని ధరించి దివ్యత్వమును విస్మరించుట చేత
మన యొక్క జీవితము సార్థకము కాకుండా పోవుచున్నది. ప్రేమస్వరూపులారా! నిజముగా భోగమునకు
త్యాగమునకు ఎట్టి వ్యత్యాసమున్నదని గుర్తించాలి. ఉపనిషత్తులు భోగమును త్యాగముతో కూడి అనుభవిం
చినప్పుడే యోగమవుతుంది అన్నాయి. త్యాగ భావముతో అనుభవించిన భోగమే యీ దివ్యమైన మానవ
త్వము. ఇతే ప్రాపంచికముగా భోగమునకు యోగమునకు నిజమైన సన్నిహిత సంబంధబాంధవ్యము
యీరీతిగా వున్నదని విచారించాలి.

భోగి యోగ తత్త్వాన్ని యేమాత్రము గుర్తించుకొనడు. యోగి భోగమును విచారించడు. ఈ
రెండింటికిని మధ్యలో త్యాగము వుంటున్నది. 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశు' ఈ భోగ
మునకు యోగమునకు మధ్యలో త్యాగము అత్యవసరము. ఈ త్యాగము లేకపోవటము చేతనే మానవత్వము అ
నేక అశాంతులకు గురియైపోతున్నది. భౌతికంగా, వైజ్ఞానికంగా మానవజాతి యెంత ప్రగతిని సాధించినది
కాని నైతికంగా క్షుద్ర విమర్శలను సంకుచితమైన భావములను అధికమించలేకపోతున్నది. దీనికి కారణమే
మని ఎవరికి వారు లోతుకి దిగి విచారించినప్పుడు అనేకవిధములుగా మానవుని యొక్క హృదయకుహ
రమునందు పాతుకొనిపోయిన స్వార్థమే దీనికి మూలకారణము. ఈ స్వార్థ స్వప్రయోజనములు ఆధారము

చేసుకోటం చేతనే మానవత్వము మరింత నైతికంగా దిగజారి పోతున్నది. స్వార్థము వుండవలసినదే గానీ 'నశ్రేయో నియమం వినా' దేనికి ఒక నియమము వుండాలి. ఒక హద్దు వుండాలి. మానవుడు ఏ పని చేసినా ఏమి తలంచినా ఏమి చెప్పినా అన్నింటికిని వెలుపల స్వార్థము కదులుతూనే వుంటున్నది. ఈనాటి మానవుడు స్వార్థము యొక్క హస్తములో కేవలము కీలు బొమ్మవలె జీవిస్తూ వుంటున్నాడు. స్వార్థము లేకుండా జీవితములో ఒక్క అడుగు కూడను ముందుకు వేయటం లేదు మానవుడు. అలాంటి పరిస్థితి యందు మానవత్వము ఏ రీతిగా దివ్యత్వమును పొందగలదు, అనుభవించగలదు. కాదు కాదు. మానవ నిర్మాణము విశ్వనిర్మాణము. మానవుడు బాగుపడినప్పుడే విశ్వము బాగుపడుతుంది. వ్యక్తి మంచివాడైనప్పుడే సమాజము మంచిదౌతుంది. కనుక ప్రేమస్వరూపులారా! వ్యక్తిత్వము మనము చక్కగా గుర్తించి వర్తించటము అత్యవసరము.

(2) మానవత్వములో వున్న దివ్యగుణములు మనము పోషించుకోవాలి. కేవలము పశుత్వము చేత మనము ద్వేషము, అసూయ అనేటువంటి దుర్భావముల చేత మనయొక్క పవిత్రమైన కీర్తిని హరనము చేసుకుంటున్నాము. ఇది మానవత్వానికే కళంకము. మా-న-వ. మా-అనగా అజ్ఞానము. న-అనగా లేకుండా. వ- అనగా వర్తించటం. అజ్ఞానము లేకుండా వర్తించటం. అతడే మానవుడు గాని కేవలము అజ్ఞానము చేత, అహంకారము చేత దుర్వినియోగ పరచుకొనుట మానవత్వానికి సరియైనది కాదు. ఇలాంటి పవిత్రమైన దివ్యసన్నివేశమందు, దివ్యమైన అవకాశమునందు యింతమంది మంత్రులు యిక్కడ చేరి ప్రజలకు సరియైన అనుకూలములను సరియైన రీతిలో సమకూర్చుట ఎంత అదృష్టము. నిజముగా ఆంధ్రప్రదేశ్ లో యొక్క విషయమునందు అనేక అనుకూలములు చేస్తూనే వున్నది. కానీ దానికి కూడను అనేక అడ్డంకులు తగులుతూనే వుంటవి. దానిని నెట్టుకొని తట్టుకొని ముందుకు నడచినప్పుడే మనము సాధించటానికి వీలవుతుంది. అన్ని అదురు దెబ్బలు, ఎదురు దెబ్బలు తగులుతుంటాయి. దానికి మనము యేమాత్రము లొంగరాదు. దానినెదుర్కొని మనము సాధించటానికి ప్రయత్నించాలి. 'న సుఖాత్ లభ్యతే సుఖం' సుఖము మనకు కావాలంటే సుఖము ద్వారా మనకు లభ్యము కాదు. కష్టము ద్వారానే లభ్యమవుతుంది. కష్టములననుభవించకే సుఖమును పొందటానికి ఎవరికి వీలు కాదు. కనుకనే అనేక కష్టములను మనం ఎదుర్కొని సాధించినప్పుడే మానవత్వములో సరైన సుఖమును పొందగలము. మానవత్వము 'జంతూనాం నరజన్మ దుర్లభం'.

కారణమేమిటి? మన భారతదేశమందు పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి. ఈ మూడే మూర్తుల స్వరూపముగా ఆదర్శమునందిస్తూ వచ్చాయి. కానీ యీనాడు అవి మూడూ కోల్పోటం చేత మానవత్వము యొక్క విశిష్టతను మనము వదులుకుంటున్నాము.

పాపభీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దాని బట్టి
మానవత్వమడుగ మానవులందున
విశ్వశాంతికి దియె విప్లవంబు.

ఈనాడు ప్రపంచములో పల శాంతికి అనేక అడ్డులు. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి కోల్పోయినాము. పాపమంటే భయమే లేదు. అదే యీనాడు అభయముగా మారుతుండాది. పాపభీతి, దైవద్వేషము అభివృద్ధి అవుతున్నాది. ఇది కాదు. దైవమును మనము యీనాడు మరచిపోవటం చేతనే మనకి యిన్ని కష్టములు లభిస్తున్నాయి. భారతదేశము అనాది కాలము నుండి కూడను దైవ విశ్వాసము వలనే బ్రతుకు కలుగుతూ అనేక దేశములకు ఆదర్శమైన జీవితాన్ని అందిస్తూ వచ్చింది. అలాంటి దివ్యమైన భవ్యమైన భారతదేశమునాడు ఏవిధముగా దైవ విశ్వాసాన్ని కోల్పోతున్నాము. భారతీయ సంస్కృతిని మనము యేవిధముగా మరచిపోతున్నాము. మరచిపోరాదు. భారతదేశము సత్యములో కూడినటువంటిది. ధర్మములో కూడినటువంటిది. భారతీయులు సత్యవ్రతులు. ధర్మపరాయణులు. న్యాయమే వారికి ఆటపట్టు. ఇది ప్రతి భారతీయుని సాంప్రదాయము. దీనికి వారసులుగా వుండాలి. దీన్ని మీరు పోషించాలి. ఆనాడే తిరిగి మీరు నవ్యమైన భారతాన్ని మీరు అనుభవించవచ్చును. ఆనందించవచ్చును.

(3) దివ్యమైన ప్రేమస్వరూపులారా! మానవత్వము లోపల కలతలు అనేకంగా వుంటాయి. కానీ వానిని మనము సవరించుకోవాలి. అందరు భగవంతుని బిడ్డలే. అన్నదమ్ముల లోపల అనేక రకములైన సమస్యలు ఏర్పడుతూ వుంటాయి. కాని ఒకరికొకరు సమన్వయపరచుకొని దానిని సంరక్షించుకోటానికి తగిన కృషి చెయ్యాలి. ఎవరియందు మనము ద్వేషమూ వుండరాదు. "ఈశావాస్యమిదం సర్వమ్" వాసుదేవ సర్వమిదం. బల్బులు ఎన్ని వుండినప్పటికి కరెంటు ఒక్కటిగానే వుంటుంది. తీపులు ఎన్ని చేసినప్పటికిని చక్కెర ఒక్కటిగానే వుంటుంది. నగలు ఎన్ని చేసినప్పటికి బంగారు ఒక్కటిగానే వుంటుంది. ఈ ఏకత్వములో వున్న అనేకత్వము మనము పెంచుకోరాదు. అనేకత్వములో వున్న ఏకత్వము పెంచుకొని దివ్యత్వమును అనుభవించినప్పుడే యీ పవిత్రమైన భారతదేశము నిత్యకళ్యాణ పచ్చని తోరణముగా కలకల కిలకిల లాడుతూ వుంటుంది. అలాంటి దేశమున మనము జన్మించి, అలాంటి దేశములో మనము భారతీయులమని పేరుపొంది, భారతీయ సంస్కృతిని యీనాడు విస్మరించినామంటే నిజముగా మనయొక్క దురదృష్టమనే చెప్పవచ్చు. కనుక ప్రభుత్వము ఎన్ని చేసినప్పటికి ప్రభుత్వము వారి వారి స్థాయికి తగినట్టుగా వారు చేస్తూ వుంటారు. అన్నింటియందు కూడను ప్రభుత్వము పైననే మనము ఆధారపడకూడదు. ప్రజలయొక్క సహకారము కూడను అత్యవసరము. ఇది ఒక మాల. అనేక పుష్పములు చేరి

వుండటం చేతనే యిది మాలగా యేర్పడిపోయింది. పుష్పములు వేరువేరుగానీ దారము ఒక్కటే. ఈ పుష్పము నిన్నటి దినము మొగ్గ. నేడు విచ్చుటం. రేపు వాడిపోవటం. కాని దారము నిన్నా దారమే, నేడు దారమే, రేపు దారమే. బ్రహ్మసూత్రమనగా ఏమిటి? సర్వమానవులనే పుష్పములందు కూడను దైవమనే సూత్రము చేరివుండున్నది. నాశము లేనటువంటిది.

'నిర్గుణం సనాతనం నికేతనం నిత్యశుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం'. అలాంటి దివ్యత్వాన్ని మనము హృదయమునందే వుంచుకొని బాహ్యమైన విషయములందు మాత్రమే మనము వుద్రేకులమై పోతున్నాం. వుత్సాహ నిరుత్సాహములకు గురైపోతున్నాం. కాదు కాదు. ఇవన్నీ తాత్కాలికమైనవి. వచ్చిపోయే మేఘముల వంటివి. దీనిని మనం యేమాత్రం లక్ష్యం చేయరాదు. ప్రజలందరు ఏకమత్యంగా వుంటుండినప్పుడు ఏకమత్యమే మన జీవితము. ఈ ఏకమత్యమును కోల్పోటం చేతనే మనము యీనాడు యిన్ని అవస్థలకు గురై పోతున్నాం. ప్రేమస్వరూపులారా! ఒకరికొకరు ఐకమత్యమును పెంచుకోవాలి. వ్యక్తిగతమైన ద్వేషములు వుండినప్పటికి భారతదేశము యొక్క సమిష్టిని మనము అభివృద్ధి గావించుకొని భారతీయపుత్రుల మనే సార్థకనామాన్ని మనము అందుకోవాలి. అప్పుడే ప్రభుత్వము, ప్రజలు అందరియందు ఏకత్వమైన దివ్యత్వము ఆవిర్భవిస్తుంది. ప్రజలు వేరుకాదు. ప్రభుత్వము వేరుకాదు. ప్రజల యొక్క ప్రభుత్వమే ప్రభుత్వము. ప్రభుత్వము యొక్క ప్రజలే ప్రజలు. ఈ రీతిగా సన్నిహిత సంబంధ బాంధవ్యము వుంటుండాలి. అంతేగాని ప్రజలు వేరు ప్రభుత్వము వేరు అనే భేద భావమునకు చోటివ్వరాదు. ప్రభుత్వమెన్నో చేస్తుంది. వారికి కూడను ఎన్నో ఆటంకాలు, ఎన్నోనిబంధనలు వున్నాయి. rules and regulations వుంటాయి. కానీ అది తక్షణమే కావాలంటే యిది సాధ్యము కాదు. మనము కూడా యోచించుకోవాలి. ప్రతిదానికి కాలము తీసుకోవాలి. కాలకర్మ కారణ కర్తవ్యాలు కలిసివచ్చినప్పుడే మన యొక్క కార్యము నెరవేరుతుంది. అంతేగానీ ప్రతిదానికి మనము తొందరపడకూడదు. శాంతిగా మనము సాధించుకోవాలి. అల్లర్లకుగానీ విద్వేషములకుగానీ కలహములకుగానీ కల్లోలములకుగాని అవకాశమివ్వరాదు. ప్రజలలో యీ విధమైన ఉద్రేకము అభివృద్ధిగావటం చేతనే మనదేశమీ విధమైన దుస్థితికి దిగజారిపోతున్నది. ప్రజలలో యీ వుద్రేకాలు రాకూడదు. ఏదైనా శాంతముగా సమస్యలు పరిష్కారం చేసుకోవాలిగాని ఉద్రేకాలతో పరిహారము యేమాత్రము కాదు. ఒకవేళ అది పరిహారమైనప్పటికి తాత్కాలికముగా పరిహారము గావచ్చునే గాని శాశ్వతముగా పరిహారము కానేరదు. కనుక శాంతముతో ప్రభుత్వముతో సంబంధ బాంధవ్యములుంచుకొని దానితో సరియైన రీతిలో పోరాడినప్పుడే యిది శాశ్వతమైన ఆనందముగా మనకు నిలుస్తుంది.

ప్రేమస్వరూపులారా! అధికముగా కాలము తీసుకొని మీకు అధికముగా శ్రమ యివ్వటం నాకు యిష్టం లేదు. కానీ యీనాడు యీ సుగ్రామమైన పుట్టపర్తియందీనాడు యీ విధమైన అభివృద్ధుల

జరగటానికి కారణం ఏమిటి? ఎవరికి వారు కన్నులు మూసుకొని విచారించుకుంటే మీకే అర్థమవుతుంది. ఇలాంటిదాన్ని అభివృద్ధి పరచుకోటానికి తగిన హృదయాన్ని కూడను మనము పెంచుకోవాలి. మానసిక పరిణామము అత్యవసరము. రాజకీయ పరిణామము, ఆర్థిక పరిణామము, లౌకిక పరిణామము, సాంఘిక పరిణామము యీ అన్ని పరిణామములతో బాటు మానసిక పరిణామములో బాటు ఆధ్యాత్మిక పరిణామము అత్యవసరము. ఆధ్యాత్మిక పరిణామమే లేక యేది కూడను మనము సాధించలేము. 'కదలదు నీదు సంకల్పము లేక గడ్డిపోచ యయిన్' అన్నట్లుగా మీరు అనుకోవచ్చు మా భుజబలము, బుద్ధిబలము, దేహబలము, అధికార బలము వుంటున్నవని. కానీ యీ బలములంతా కదలిపోయే మేఘముల వంటివి. క్షణకాలములో కదలిపోతూ వుంటాయి. ఆత్మబలమే నిజమైన బలము. ఇక సర్వబలములు దుర్బలములే. ఆత్మబలమును పెంచుకోవాలి. ఆత్మవిశ్వాసమును పెంచుకోవాలి. ఆత్మవిశ్వాసముతోనే మనము అన్ని కార్యములు సాధిస్తూ రావాలి. ప్రభుత్వానికి అండదండలుగా మీరు నిల్చి ప్రభుత్వము యొక్క ప్రయత్నములకు సరైన సహకారము మీరు అందించి ప్రభుత్వము ద్వారా మీరు పొందవలసిన ఫలితములన్ని కూడను సక్రమముగా మీరు పొందటానికి తగిన హృదయాన్ని మీరు పెంచుకోండి. అంతేగాని యీ ప్రభుత్వము ఆ ప్రభుత్వమని ప్రభుత్వములపైన మనము యేమాత్రము ద్వేషము పెట్టుకో కూడదు. ఇది కేవలము సంకుచితమైన హృదయము కలిగిన వారికి యిలాంటి బేధములు వస్తాయి. ఎవరైనా ప్రభుత్వము ప్రభుత్వమే. వారు వుండినప్పుడు వీరు, వీరు వుండినప్పుడు వారు యీ విధమైన బేధములు మనము పాటించకూడదు. ఎవరి స్థాయి వారిది. కానీ మనస్థాయిని మనము వదలకుండా దానిని గట్టిగా పట్టిసాధించటానికి పూనుకోవాలి. చెన్నారెడ్డిగారు ఆరోగ్యము చేత ఎన్నో విధమైన బాధలను పొందినప్పటికి తిరిగి వారికి వారి పత్నికి వుండిన భక్తిప్రపత్తుల యొక్క ప్రభావము చేతనే వారు చక్కని ఆరోగ్యమును పొందివచ్చారు. తిరిగి చక్కని పరిపాలన చేస్తూ వస్తున్నారు. దానిని మనము సరియైన రీతిలో వినియోగించుకోటానికి మీ హృదయదౌర్బల్యమును మీరు కొంతవరకు దూరము చేసుకొని విశ్వాసములో మీరు సాధించుకోటానికి ప్రయత్నించాలిగాని దీనికి విరుద్ధంగా మీరు యేమాత్రం పోకూడదు. ఏపార్టీ మనం విరోధంగా పోకూడదు. అన్నీ ఒక్కటే. ఇలాంటి పరిస్థితిలో ఏ ప్రభుత్వం ప్రస్తుతం ఇప్పుడు వుంటున్నదో ఆ ప్రభుత్వమును బలపరచుకొని తద్వారా మనము ఆనందమును పొందటానికి తగిన ప్రయత్నం చేయాలి.

ఈ నాడు యిక్కడ యాత్రికులకు సుందరమైన బస్ స్టాండు ప్రారంభమైంది. కేవలము వసతులు మాత్రమే కల్పించినంత మాత్రమున చాలదు. ప్రయాణీకులు భద్రతను కూడను చూచుకోవాలి. మీరు దినము పేపర్లో చూస్తూ వుంటారు. ఈ ప్రయాణీకులకు యీ బస్సులో దోపిడీ జరిగింది. ఈ విధమైన కష్టాలు పడుతూ వుంటారు. కాని వటన్నిటికి ప్రభుత్వాన్ని తిట్టకూడదు. ప్రజలయొక్క బాధ్యత వుంటున్నది.

తాను పోనివి అడ్డుతగలటానికి తగిన కృషి చెయ్యాలి. అంతేగాని నోపెట్టి యిక్కడపెట్టను. దొంగిలించు కొని పోయినారు. ప్రభుత్వము తగిన భద్రతను యివ్వలేదు అని ప్రభుత్వముపైన వేస్తే అది ప్రభుత్వము తప్పు కాదు. నీతప్పు. నీ కర్తవ్యము నీవు నిర్వర్తించుకో. నీ సామాను నీవు చక్కగా కాపాడుకో. అన్నింటిని ప్రభుత్వము పైన వేస్తుంటే యిది సరియైనది కాదు. ధర్మం కాదు. ప్రభుత్వమును కోరవలసినవి, ప్రభుత్వముతో చేయించుకోవలసినవి అనేకంగా వుంటున్నాయి. అట్లు కాకుండా కేవలం నీ బలహీనతలంతా కూడను ప్రభుత్వముపైన రుద్ది వారిని నిందించటంగాని, వారిని విమర్శించటంగాని మంచిది కాదు. 'అద్వేష్టా సర్వ భూతానాం' ఎవరిని మనము ద్వేషించ కూడదు. ఎవరిని చూచినా అందరియందు వుండిన భగవంతుడు ఒక్కడే అని 'సర్వ భూత నమస్కారం కేశవం ప్రతిగచ్ఛతి' యని ఎవరికి నమస్కారము చేసినా భగవంతునికే చెందుతుందని ఆ సద్భావాన్ని, ఆ సత్ హృదయాన్ని, ఆ పవిత్రమైన ఏకత్వమైన ప్రేమను మనం అభివృద్ధి పరచుకున్నప్పుడే నిజంగా యిటువంటివి మనము ఎన్నో చేసుకోవచ్చు. ఆయన చెప్పాడు. యివంతా చాలా చిన్నపనులని. నిజంగా రాజు తలుస్తే దెబ్బలకు కొదవా? అన్నారట. రాజు తలుస్తే ఏమో కొర్రాలకు కాదవా! కాదు. కనుక అతన్ని సరియైన రీతిలో మీరు వినియోగించుకోటానికి తగిన అర్హతను సంపాయించుకోవాలిగాని అతనిదికాదు దోషం మనదోషాన్ని మనం పెట్టుకొని యితరులపైన దోషాన్ని పెట్టుకుంటూ పోతే ఏనాటికి బాగుపడలేము. మన దోషాన్ని మనం వెతుక్కొని, మన దోషాన్ని మనం నిర్మూలము గావించుకొని దేశము యొక్క నిర్మాణానికి తగిన కృషి చేసినప్పుడే సరియైన అభివృద్ధి కలుగుతుంది కనుక మీ యందరిని ఆశీర్వదించి చిరంజీవి యైన చెన్నారెడ్డి ఆయురారోగ్యములు అభివృద్ధి కావాలని, వారి భక్తి ప్రపత్తులతో బాటు, వారు ప్రజలయొక్క అనుకూలములను అభివృద్ధి పరుస్తారు కనుక ప్రతి ఒక్కరు ఎవరువుండిన ప్రతిఒక్కరి ప్రభుత్వము చక్కని అభివృద్ధిలోకి రావాలి. ప్రభుత్వము చక్కని అనుకూలములు చెయ్యాలి. ప్రభుత్వము ఎప్పుడు కూడను సరియైన పద్ధతిలో నడుచుకోవాలని ప్రార్థన చేయండి. అంతేగాని అల్లకల్లోలములకు యేమాత్రము అవకాశము కలిగించకుండా సమానభావముతో, సానుభూతిలో మీరు యీ కార్యక్రమములో పాల్గొని యిలాంటి పవిత్రమైన కర్మలు ఆచరించాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

1990 అక్టోబరు 17వ తేదీ బుధవారం పుట్టపర్తిలో భగవాన్ బాబావారిచ్చిన దివ్యోపన్యాసం